## క్లుప్తంగా

### ఘనంగా గ్రామ దేవతల జాతర

కాళ్ల: మండలంలోని పల్లిపాలెం గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీమారెమ్మ, శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతర మహోత్సవంలో భక్తులు పాల్గొనిప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

భీమవరం: పట్టణంలోని 16వ వార్డులో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ మాట్లాడుతూ ప్రజల్లో భక్తిభావం పెంపొందించడానికి ఇటువంటి వేడుకలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి నర్సింహారావు, పల్లా వెంకట సుబ్రహ్మణ్యం, యర్రా వెంకట సత్యనారాయణ, కోటేశ్వరరావు, చింతపల్లి ఆంజనేయులు, మాదిరెడ్డి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### వెలమగూడెం వంతెన ప్రమాదకరం



ప్రమాదకరంగా ఉన్న వంతెన అప్రోచ్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని వెలమగూడెం ప్రాంతంలో ఉన్న వంతెన అప్రోచ్ అధ్వానంగా ఉండడంతో వాహనాలు వెళ్లే సమయంలో టైర్లకు రోడ్డు గోడు గట్టిగా తగులుతుండడంతో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. నడిచి వెళ్లే పాదచారుల్లో వృద్ధులు అయితే ఆ గోడు తగిలి పడిపోతున్నారు. ఆర్‌టీసీ బస్సులకు వన్ వే ఈ రోడ్డు నుంచి ఇవ్వడంతో రద్దీ ఎక్కువగా పెరిగింది. దాంతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు వంతెనకు ఆ చివర నుంచో లేదా ఈ చివర నుండో వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న అప్రో చ్ పనులు చేయా లని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

### తాతాజీ ఇంటి వద్ద పోలీసుల రెక్కీ




తాతాజీ ఇంటి వద్ద మఫ్టీలో ఉన్న పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో యలమంచిలి మండలం ఎంపీపీ ఎన్నికల్లో లేని గొడవను సృష్టించి వైఎస్సార్ సిపి నాయకులపై యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో యడ్ల తాతాజీని టార్గెట్ చేస్తూ ఆదివారం అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఉదయం నుండి పోలీసులు తాతాజీ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. మఫ్టీలో ఇంటికి వెళ్లిన పోలీసులు తాతాజీ ఇంటి చుట్టూ ఉన్న వీధులన్నీ అన్ని తిరిగి పరిశీలన చేశారు. చివరకి తాతాజీ ఇంటిలో లేకపోవడంతో ఆ వీధి చివరలోనే పహారా కాశారు. తాతాజీతో పాటుగా కుమార దత్తాత్రేయ వర్మ, ఉచ్చుల స్టాలిన్, బండి రమేష్, పాలపర్తి కృపానాథ్, రేలంగి శ్రీనివాస్, చెన్ను విజయ్‌లపై కేసులు నమోదు చేశారు. ఈ విషయంపై తాతాజీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీకి చెందిన ఓ ఎస్సీ నాయకుడితో ఎస్సీ ఎస్టీ కేసుతో పాటు కానిస్టేబుల్ విధులను అడ్డుకున్నారంటూ ఒకటి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద విధులు అడ్డుకున్నారంటూ వీఆర్‌ఓలతో మరోటి ఇలా అన్యాయంగా మూడు కేసులు బనాయించారన్నారు. అంతే కాకుండా మూడు నెలలు క్రితం గతంలో ఓ సమావేశంలో తనని కొట్టానంటూ మంత్రి కేసు పెట్టడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. రాజకీయంలో విమర్శలు ఉంటాయి తప్ప ఇలా అక్రమంగా కక్ష సాధించే చర్యలకు కూటమి ప్రభుత్వం కొత్త ఒరవడి తీసుకువస్తుందన్నారు. ఈ విషయంపై రూరల్ సీఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ తాతాజీకి 41 నోటీసులు ఇవ్వాలని చూస్తున్నామని, ఈ కేసుపై సోమవారం డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని తెలిపారు.

# ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఈత మట్టలతో క్రైస్తవుల ఊరేగింపు



బలుసుమూడి చర్చిలో నిర్వహిస్తున్న వేడుకలు

భీమవరం: పట్టణంలోని బేతనీ లూథరన్ చర్చ్ సండే స్కూల్ బాల, బాలికలు మట్టల ఆదివారం పండుగ అట్టహాసంగా నిర్వహించారు. ఈత మట్టలకు రకరకాల పువ్వులు అలంకరించి చేత పట్టుకొని పట్టణ వీధుల గుండా క్రైస్తవులు భక్తి గీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బేతనీ చర్చి పాస్టర్ డేనియల్ పుష్పరాజ్ మాట్లాడుతూ క్రైస్తవులు ఏసుక్రీస్తు చూపిన మంచి మార్గాన్ని ఎంచుకొని పయనించాలనే లక్ష్యంతో మట్టల ఆదివారాన్ని నిర్వహిస్తారన్నారు. బలుసుమూడి లూథరన్ చర్చిలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్.ఎలిజబెత్ రాణి, బి సరళ పాల్, టి వజ్రమ్మ, పి శ్వేత, ఎన్ నిహారిక, జి అనిత రాణి,టి రోహిత్, గంటా సుందరకుమార్, అబ్రహం లింకన్, సంధి విజయ్ కుమార్, కొక్కరిగడ్డ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ప్రార్థనలు**

ఉండి: మండల వ్యాప్తంగా ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువ మరణం పొందే ముందు రోజుల్లో యెరూషలేము పట్టణంలో జరిగిన ఓ సంఘటన ఆధారంగా క్రైస్తవులు 40 రోజుల ఉపవాస దినాల్లో చివరి ఆదివారాన్ని మట్టల ఆదివారంగా ఆచరిస్తారు. దీనిలో భాగంగానే ఆదివారం నిర్వహించిన మట్టలాది వారం పండుగలో గ్రామ గ్రామన క్రైస్తవులు ఈత మట్టలకు పూలు అలంకరించి వాటిని పట్టుకుని ఆయా గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది క్రైస్తవులు రంగురంగు పువ్వులతో ఈతమట్టలను అలంకరించి నిర్వహించిన ఊరేగింపులు ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా చెరుకువాడ సీబీసీఎన్‌సీ పేరిష్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎన్ జార్జ్‌ముల్లర్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్ ఎం.సామ్యూల్, ఎం.ఫిలిప్, కె.ఏసు, బి.శ్రీకాంత్, బి.జార్జ్, ఎం.సుబ్బారావు, పి.పవన్, హోగ్లీ, ప్రిస్కిల్లా, కవిత, లిఖిత, తదితరులు పాల్గొన్నారు.

**క్రీస్తు మార్గం అనుసరణీయం**

కాళ్ల: క్రీస్తు మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. మండలంలో మట్టల ఆదివారం ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మట్టల ఆదివారం ఏసు క్రీస్తు గొప్పతనం, ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసే రోజుగా క్రైస్తవులు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఆయా గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రధానంగా చిన్నారులు పెద్దలు గ్రామంలో ఈత మట్టలు పట్టుకుని క్రైస్తవ గీతాలు పాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

**క్రైస్తవుల ఊరేగింపు**

వీరవాసరం: క్రైస్తవ విశ్వాసులు, సంఘ కాపరుల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాయకుదురులోని పలు చర్చిల ఆధ్వర్యంలో ఈత మట్టలతో క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చిలకపాటి సునీత, రవి, ఠాగూర్, నవీన్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.



భీమవరం: బాల, బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఉండి: యండగండిలో వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



కాళ్ల: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): మన ఇంటిలాగే మనం ప్రయాణించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రైల్వే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఎస్ఎం శ్రీనివాస్ అన్నారు. భారత రైల్వే వారోత్సవాల్లో భాగంగా రైల్వే శాఖ, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టౌన్ రైల్వే స్టేషన్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకు అన్ని రైల్వే స్టేషన్లలో రైల్వే విశిష్టత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని, ముగింపు రోజున రైల్వే అధికారులకు సత్కారాలు, రైల్వే కార్మికులకు నూతన వస్త్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చల్లా రాము, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనుకంజ

- హైస్కూల్ ప్లస్‌లో మూడు చోట్ల ఉత్తీర్ణత నిల్
- ఉత్తీర్ణతలో ప్రైవేట్ కాలేజీలదే హవా
- జిల్లా వ్యాప్తంగా 80 శాతం ఉత్తీర్ణత



ఇంటర్ పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు (ఫైల్)

భీమవరం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో జిల్లాకు 10వ స్థానం వచ్చింది. ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం 84 శాతం, ప్రథమ సంవత్సరం 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా ద్వితీయ సంవత్సరం పరీక్షకు 14,260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 11,948 మంది ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరం పరీక్షలకు 17,257 మంది హాజరు కాగా 12,046 మంది ఉత్తీర్ణత సాధించారని డీఐఈవో ఎ.నాగేశ్వరరావు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 981 మంది విద్యార్థులు హాజరు కాగా 407 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 703 మందికి 487 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఎయిడెడ్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 296 మందికి 174 మంది, ద్వితీయ సంవత్సరం 262 మందికి 192 మంది పాస్ అయ్యారు. హైస్కూల్ ప్లస్‌లో మొదటి ఏడాది 246 మందికి 102 మంది, ద్వితీయ సంవత్సరం 167 మందికి 109 మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం 132 మందికి 118, మంది, ద్వితీయ సంవత్సరం 96 మందికి 90 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం 15,500 మందికి 11,191 మంది, ద్వితీయ సంవత్సరం 12,936 మందికి 11,004 మంది, కో–ఆపరేటివ్ కళాశాలల్లో మొదటి సంవత్సరం 97 మందికి 52 మంది, ద్వితీయ సంవత్సరం 83 మందికి 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు నాగేశ్వరరావు వివరించారు.

**హైస్కూల్ ప్లస్‌లో మూడుచోట్ల ఉత్తీర్ణత నిల్**

జిల్లా వ్యాప్తంగా 19 హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించగా కాళ్ల మండలం కోపల్లె, నరసాపురం మండలం కొప్పర్రు, పోడూరు మండలం జిన్నూరు గ్రామాల్లో హైస్కూల్ ప్లస్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఒక్కరూ ఉత్తీర్ణత సాధించకపోవడం విశేషం.

## ప్రభుత్వ పాఠశాలలపై ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటి ప్రచారం ఆదివారం ప్రారంభించారు. మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులున్నాయని, వత్తిడి లేని నాణ్యమైన విద్యను అందించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారని ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీఎస్ నారాయణ (విక్రమ్) చెప్పారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వచ్చే సదుపాయాలు, విద్య, భవిష్యత్ పరిణామాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. కార్పొరేట్ కన్నా మిన్నగా విద్యా బోధనను ఆంగ్లంలో అందజేస్తున్నామని వివరించారు. పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నామని చెప్పారు. యూటీఎఫ్ మండల జనరల్ సెక్రటరీగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న దృఢ సంకల్పంతో ఈ చర్యలు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.

## ఇంటర్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో విద్యా సంస్థల యాజమాన్యం

భీమవరం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో భీమవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి వీవీఎం సత్యసాయి 470కి 466 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచాడని చెప్పారు. బైపీసీలో 440 మార్కులకు గాను కె.శ్రావ్య, జి.హాసినీ రిత్విక, జి.మనస్విని 434 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా పి.జ్యోషిక శ్రీవల్లి 433, కె.మధునయన, కె.ప్రజ్ఞ ప్రిస్కిల్లా 432 మార్కులు, సీహెచ్ లెహర్ష, సీహెచ్ రేవతి, జె.విద్య 431 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు ఎండి అశ్రఫ్ 990 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా కె విమల్, కె మణికంఠరెడ్డి, కె.సాయి హర్షిక్, కేఎస్ హాసిని, కేబీఎస్ఎల్ ప్రత్యూష 989 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు యు.శరణ్య 988 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా సీహెచ్‌బీఎల్ ప్రసన్న, కె.శేషశ్రీ 987 మార్కులు, పి.భవ్యశ్రీ, ఓపి దుర్గాప్రసాద్ 986 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం 96.8 శాతం, ద్వితీయ సంవత్సరం 99.1 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు అభినందించారు.

## ధ్యానంతో మెరుగైన ఆరోగ్యం



ఉచిత ధ్యాన శిక్షణలో పాల్గొన్న సాధకులు

వీరవాసరం: ప్రతి రోజూ ధ్యానం చేస్తే మెరుగైన ఆరోగ్యం పొందొచ్చని పిరమిడ్ మాస్టర్ లక్ష్మణ్ అన్నారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీతారామ దేవస్థానంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యకమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరవాసరం పిరమిడ్ మాస్టర్లు, భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ మామిడి లక్ష్మణ్ ధ్యాన శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మామిడి లక్ష్మణ్ మాట్లాడుతూ ధ్యానం సర్వరోగ హారిణి, ధ్యానం సకల భోగకారిణి, ధ్యానం సత్యజ్ఞాన ప్రసాదిని అని తెలిపి ధ్యానసాధన ద్వారా తన జీవితంలో జరిగిన మార్పులను తెలిపారు. ధ్యానంతో పాటు శాకాహారం తినాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. అనంతరం సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడిశెట్టి కృష్ణారావు, ఉదయ్, వర్రె విశ్వేశ్వరరావు, కృష్ణవేణి, యడ్ల నాగమణి, విజయలక్ష్మి, మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పాలకోడేరు: మండలంలోని వేండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు పాఠశాల ప్రాంగణంలోకి రాగానే ఒక్కసారిగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఆత్మీయ సత్కారం చేసి, చదువుకున్న పాఠశాలకు బీరువాను బహూకరించారు. అంతేకాకుండా పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లను అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

కాళ్ల: మానవత సేవా సంస్థ, భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో బొండాడ గ్రామంలో ఆదివారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. మార్చి 26న గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించగా, 20 మందికి ఆపరేషన్ చేయించి, అవసరమైన 78 మందికి ఉచితంగా కళ్లజోళ్లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అందించామని సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్‌వర్మ మాట్లాడుతూ పరమహంస యోగానంద నేత్రాలయ సంస్థ వేమగిరి, రాజమండ్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 150 మంది కంటి పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కో–చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమారవెంకటేశ్వర ప్రసాద్, డైరెక్టర్ వడ్డి వెంకటేశ్వరరావు, క్యాంపు కో–ఆర్డినేటర్ పెన్మెత్స రంగరాజు, చెరుకువాడ మహంకాళి, గూడె సుబ్బారావు, మందపాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి విరాళం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి దాత రూ.70,999 విరాళం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయంలో దాతలు ఉప్పలపాటి స్వామి కుమారుడు జనార్దనరావు జ్ఞాపకార్థం వారి మనవడు ఉప్పలపాటి చాణక్య వర ప్రసాద్ స్వామి విరాళాన్ని కమిటీ సభ్యులకు అందించారన్నారు. ఆలయాభివృద్ధికి విరాళం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా మావూరమ్మ జాతర



మావూరమ్మ ఊరేగింపు ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని బంగారు వారి చెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ మావూరమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పట్టణ ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. కర్నేని గౌరునాయుడు, రోజారమణి దంపతులు ఉత్సవాలను ప్రారంభించారు. గరగల నృత్యాలు, సన్నాయి వాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాలు, అష్టలక్ష్మీ బొమ్మలతో అమ్మవారి జాతర ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. 16 వరకూ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు మతికాని ఉమా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కిషోర్, బార్గవ్, అచ్యుతరావు, కె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పద్దాల వెంకమ్మ జాతర**

పెనుగొండ: పెనుగొండ శాంతి నగర్‌లో పద్దాల వెంకమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గరగ నృత్యాలు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కొందరు మహిళలు ఏకరూప వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. జాతర మహోత్సవం సందర్భంగా శాంతి నగర్ వాసులు సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు.

### కేంద్ర మంత్రి దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు

పాలకోడేరు: ప్రధానమంత్రి ఆశయాల కనుగుణంగా ఒకే దేశం.. ఒకే కమిషన్ అమలు చేసి రేషన్ డీలర్లకు జీవన భద్రత కల్పించాలని మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోము సాయి రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం పెన్నాడ గ్రామం వచ్చిన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు వినతిపత్రం సమర్పించారు. రేషన్ డీలర్లు కేంద్రం పరిధిలోని జాతీయ ఆహార భద్రత పథకంలో ఉన్నామని, రాష్ట్రంలో 29,500 మంది ఉన్నామని వివరించారు. కనీస వేతనం అమలు చేయాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీనివాసవర్మ డీలర్ల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

### విద్య, వైద్య రంగాల్లో సహాయం అందించాలి

భీమవరం: విద్య, వైద్య రంగాల్లో ఆర్థికంగా అవసరమైన వారికి సహాయం అందించాలని బాధ్యత ప్రతి ఒక్కరిపై కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో మన వారి కోసం మనం పేరుతో కాపు సామాజిక వర్గం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

### ఘనంగా బీపీ మండల్ వర్ధంతి

పాలకొల్లు సెంట్రల్: దేశంలో మండల కమిషన్ చైర్మన్‌గా అన్ని కులాల జీవన స్థితిగతులపై సమగ్ర విచారణ జరిపి మొదటి రికమండేషన్ ఓబీసి రిజర్వేషన్లు అమలు చేయాలని, రెండో రికమండేషన్ చట్ట సభల్లో బీసీ కులాలలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మండల్ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ అప్పటి కేంద్రానికి నివేదిక ఇచ్చారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవానీ అన్నారు. ఆదివారం పట్టణంలో బీపి మండల్ 43వ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ భవానీ మాట్లాడుతూ మండల్ కమిషన్ నివేదించిన అంశాలను నేటికి అమలు చేయలేదని అన్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని తీర్మానం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, పట్టణ అధ్యక్షుడు ముక్కు సత్యనారాయణ, బీరక ప్రసాద్, పొన్నమండ ముత్యాలరావు, కోరుకొండ సుబ్బారావు, నీలంశెట్టి సత్యప్రసాద్, దొంగ రాంబాబు, కోరుకొండ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

### ఒకే సంఘంగా ముందుకు సాగాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ విశ్వ బ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉషా గ్రాండ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు జీకే ఆనంద్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నక్కా చైతన్య శ్రీనివాస్ నిర్వహణలో రాష్ట్ర సంఘం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒకే సంఘం, ఒకే నాయకత్వంతో ముందుకు సాగుద్దామని చెప్పారు. తొలుత విశ్వకర్మ పోతులూరి వీరేబ్రహ్మేంద్రస్వామిని పూజించారు. విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వృత్తి సంఘ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో కుందుర్తి గురవాచారి, మేడిపి ప్రసాద్, గోకవరపు శ్రీనివాస్, రాయల రాము, బి.వెంకట శేషాచార్యులు, 23 జిల్లాల నుంచి వృత్తి సంఘాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.